

నగరంలో శ్రీసరస్వతీ శిశు మందిర్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

# శిశుమందిర్‌కు సహకారం అందించండి

- దాతలు. పూర్వ విద్యార్థులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు

విద్యానగర్, మే 17: కరీంనగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ నూతన భవన నిర్మాణానికి తన వంతు ఆర్థిక సహాయ సహకారాలు తప్పకుండా అందిస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హామీ ఇచ్చారు. అలాగే శిశు మందిర్ పూర్వ విద్యార్థులతో పాటు తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు రూపుదిద్దుకుంటుందని విశ్వసించే జాతీయవాదులు, దాతలందరూ సరస్వతీ శిశు మందిర్‌కు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై సంతోషం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లోని సరస్వతీ శిశు మందిర్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్‌ఈ విధానాన్ని అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. శిశు మందిర్‌లో చదువుకోవడంవల్లే తాను ఈ స్థాయికి చేరుకుని ప్రజలకు సేవ చేయగలుగుతున్నానని చెప్పారు. కార్యక్రమానికి మాధవరం కాంతారావు, అజితేష్ (బిల్డర్), ఇంజినీర్ రాఘవ కృష్ణ, సమితి అధ్యక్షుడు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, పాఠశాల కార్యదర్శి ఇంజినీర్ కోల అన్నారెడ్డి, విభాగ్ కార్యదర్శి మేచినేని దేవేందర్ రావు, తదితరులు హాజరై విలువైన సూచనలు చేశారని పాఠశాల ప్రిన్సిపాల్ సముద్రాల రాజమౌళి తెలిపారు.

# ‘బెల్ట్’ జోరు..

- గ్రామాల్లో వీధివీధినా వెలుస్తున్న షాపులు
- ఇష్టారీతిగా అమ్మకాలు
- తరచూ మందుబాబుల గొడవలు
- దందాకు సహకరిస్తున్న వైన్సుల నిర్వాహకులు

**బెల్ట్ దందా జోరు పెరుగుతున్నది. ఫలితంగా గ్రామాల్లో మద్యం ఏరులైపారుతున్నది. వీధివీధినా బెల్ట్‌షాప్‌లు వెలుస్తుండగా, కొన్ని చోట్ల తరచూ మందుబాబుల వీరంగంతో ప్రజల ప్రశాంతతకు భంగం వాటిల్లుతున్నది. ఏదైనా ఎలక్షన్లప్పుడో, కొన్ని సందర్భాల్లో నామ మాత్రంగా చర్యలు తీసుకుంటున్న పోలీస్, ఎక్సైజ్ శాఖలు తర్వాత మిన్నకుంటున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.**

తిమ్మాపూర్, మే 17: మండల కేంద్రంతో పాటు అల్గునూర్, నుస్తులాపూర్, కొత్తపల్లిలో ప్రభుత్వ లైసెన్సు పొందిన వైన్సులున్నాయి. వీటి ద్వారా మండలంలో వినియోగదారులకు మద్యం సరఫరా చేయాలి. అయితే వైన్సులకు వెళ్లలేనివారు, రాత్రి వైన్సులు లేని సమయంలో మద్యం అవసరం ఉన్నవారు బెల్ట్‌షాపుల్లోనే కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో బెల్ట్‌షాపుల వారికి వైన్స్ నిర్వాహకులు కొండంత అండగా ఉంటున్నారు. ‘మీ దగ్గరికి ఎవరూ రారు.. మేము చూసుకుంటాం’ అని భరోసానిస్తున్నారు. అందుకు గానూ ఒక్కో బీరుపై రూ.10, మద్యం బాటిల్‌పై రూ.10నుంచి 30వసూలు చేస్తున్నారు. బెల్ట్‌షాప్ నిర్వాహకులు వినియోగదారుల నుంచి ఒక్కో సీసాపై రూ.30-50 వరకు అదనంగా తీసుకుంటున్నారు.



ఇటీవల అల్గునూర్‌లో గొడవ పడుతున్న బెల్ట్‌షాప్ నిర్వాహకులను అదుపు చేస్తున్న పోలీసులు

### వైన్సుల్లో స్పెషల్ కౌంటర్..

ఈ బెల్ట్ షాపుల నిర్వాహకులకు మద్యం అమ్మేందుకు వైన్సుల్లో స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. సాధారణంగా వినియోగదారులకు ఇచ్చే కౌంటర్‌తో పాటు పక్కనే ప్రత్యేక షెట్టర్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. చట్టపరంగా ఒక వ్యక్తికి పరిమిత స్థాయిలోనే మద్యం అమ్మాలి. కానీ బెల్ట్‌షాప్ నిర్వాహకులకు అక్రమంగా వసూలు చేసుకుని ఎన్నంటే అన్ని కాటన్లు ఇచ్చేస్తున్నారు. వీరు ఇస్తున్న అండతో గ్రామాల్లో విచ్చలవిడి అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పెద్ద గ్రామాల్లో గ్రామానికి పదిపైనే బెల్ట్ షాపులు ఉండగా.. చిన్న గ్రామాల్లో సైతం నాలుగైదు దుకాణాలు ఉంటున్నాయి.

### కిరాణా కొట్టులే.. బెల్ట్‌షాపులు

గ్రామాల్లో ఉన్న కిరాణాషాపుల్లోనే చాలా వరకు మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారు. ఏ అర్ధరాత్రి వెళ్లినా వీరి వద్ద మద్యం లభిస్తున్నది. ఎన్నికల సమయంలో అడపాదడపా దాడులు చేసి మళ్లీ గ్రామాల వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ఇష్టారీతిన అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఇక వైన్సులు రాత్రి పది గంటలకు మూసివేయడంతో డ్రింకర్స్ బెల్ట్‌షాపుల్లో కొనుగోలు చేయడానికి వచ్చి తరచూ గొడవలు సృష్టిస్తున్నారు. గ్రామాల్లో వీధుల్లో పక్కనున్న కుటుంబాలకు ఇబ్బందులు కలిగేలా వ్యవహరిస్తున్నారు. మళ్లీ వారే డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేస్తున్నారు. అలాగే బెల్ట్‌షాపుల్లో ఉద్దెర ఇవ్వకపోయినా డయల్ 100కు కాల్స్ చేసి పోలీసులను తిప్పలు పెడుతున్నారు.

### కేసులు నమోదు చేస్తాం..

తిమ్మాపూర్ సర్కిల్ పరిధిలోని తిమ్మాపూర్, మానకొండూర్, గన్నేరువరం, చిగురుమామిడి మండలాల్లో నిత్యం మా సిబ్బంది సోదాలు నిర్వహిస్తున్నారు. ఇటీవలే అక్రమంగా మద్యం అమ్మకాలు జరుపుతున్న వారిపై నాలుగు కేసులు సైతం నమోదు చేశాం. అక్రమంగా మద్యం నిల్వ చేసి అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటాం. మా ఎస్‌ఐలు రోజుకో మండలానికి వెళ్లి తనిఖీలు నిర్వహిస్తున్నారు.

**-బాబా, ఎక్సైజ్ సీఐ, తిమ్మాపూర్**

# పరీక్ష కేంద్రం ఆకస్మిక తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ ఉమేశ్ కుమార్

కమాన్‌చౌరస్తా, మే 17 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 14 నుంచి డిగ్రీ పరీక్షలు ప్రారంభం కాగా, శనివారం విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ జిల్లా కేంద్రంలోని పలు కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. అక్కడ కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, విద్యా సంవత్సరంలో ఎలాంటి మార్పులు లేకుండా తృతీయ సంవత్సర విద్యార్థులకు న్యాయం జరిగేలా పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. పరీక్షలు ముగిసిన అనంతరం మూల్యాంకనం కూడా త్వరగా చేపట్టి ఫలితాలను సకాలంలో వెల్లడిస్తామని తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రయత్నాలు చేయాలని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేశ్ కుమార్‌ను ఆదేశించారు.

# బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్ రూరల్, మే 17: కొడుకు మృతితో మనోవేదన చెంది మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన సిరికొండ తిరుపతిరావు ఇటీవల ఆత్మహత్య చేసుకోగా, శనివారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. రెండు నెలల వ్యవధిలో ఓ కుటుంబంలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఉల్లెంగుల ఏకానందం, మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్, బుడిగే పరశురాములు, బీనపల్లి రాజయ్య, ఎడ్ల బుచ్చిరెడ్డి, కొలిపాక రాజమౌళి, గుంటి కిష్టయ్య, బొజ్జ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా అన్నమాచార్యుల జయంతి



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, మే 17: జిల్లా కేంద్రంలోని కళాభారతిలో జిల్లా బాలభవన్ ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డీవైఎస్‌వో శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లోని కళలను వెలికి తీసి, ప్రతి కార్యక్రమంలో పాలుపంచుకునేలా బాల భవన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం మంచి విషయమన్నారు. అనంతరం ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో బాలభవన్ సూపరింటెండెంట్ మంజులాదేవి, నిర్వాహకులు రాధాకృష్ణ, సూర్యశ్రీ, శ్రీధర్, కృష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED



★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

PLOT FOR SALE



★KNR తీగలగుట్టపల్లిలో KCR బిల్డింగ్ దగ్గర అయోధ్యనగర్‌లో 50 & 30 ఫీట్ల రోడ్లతో 194 చ.గ.ల టు ఫేసింగ్ ప్లాటు అమ్మబడును. సెల్: 96183 37209, 76710 65100.
NTK-330283

FINANCIAL SERVICES

★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

BUSINESS OFFER



★Wanted Investor for Gents Hair Cutting Saloon Business at Hyderabad. Good Returns. Contact: 7075526841, 7075519740.
NT-Raju Yadav

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189


## ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

తెలంగాణచౌక్, మే 17: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి కురుమ కులస్తులు సిద్ధంగా ఉండాలని కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కడారి అయిలన్న కురుమ పిలుపునిచ్చారు. నగరంలోని కార్యాలయంలో నుస్తులాపూర్ కురుమ సంఘం నాయకులు శనివారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అయిలన్న కురుమ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఐక్యంగా పోటీ చేసి విజయం సాధించాలని కోరారు. కురుమ కులస్తుల్లో రాజకీయ చైతన్యం కోసం తర్వలో గ్రామ, మండలాల్లో సమావేశాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో నాయకులు సమ్మయ్య, అశోక్, శ్రీనివాస్, ఎల్లేష్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బీమా చెల్లింపు

శంకరపట్నం, మే 17: మండలంలోని వంకాయగూడెం గ్రామానికి చెందిన చల్ల కనకయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అతడి కుటుంబానికి ఎయిర్‌టెల్ బ్యాంక్ పేమెంట్ సిబ్బంది రూ.10లక్షల జీవిత బీమా చెల్లించారు. కనకయ్య రూ.899 వార్షిక ప్రీమియం చెల్లించి ఇన్సూరెన్స్ స్కీంలో చేరాడని, దీంతో అతడి కుటుంబానికి బీమా సొమ్ము అందజేశామని ఎయిర్‌టెల్ బ్యాంక్ పేమెంట్ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఎయిర్‌టెల్ డిస్ట్రిబ్యూటరీ హెడ్ విజేందర్‌రెడ్డి, జిల్లా జీఎం మహేందర్, టీఎం రాజు, డిస్ట్రిబ్యూటర్ తిరుపతి, సీజీవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన జీఎం

ముకరంపుర, మే 17: కరీంనగర్ రైల్వే స్టేషన్‌ను శనివారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ పరిశీలించారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా చేపట్టిన స్టేషన్ ఆధునీకరణ పనుల ప్రగతిని పరిశీలించి, సంబంధిత విభాగాల అధికారులకు సూచనలు చేశారు. సత్వరమే పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించినట్లు సమాచారం. జీఎం వెంట డీఆర్‌ఎం భర్తేష్, స్టేషన్ మేనేజర్ మిట్టపల్లి రవీందర్ ఉన్నారు.

## హనుమాన్ భక్తుల శోభాయాత్ర

చొప్పదండి, మే 17: చొప్పదండి పట్టణం, మంగళపల్లి గ్రామంలో హనుమాన్ భక్తులు శనివారం శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ నామ స్మరణతో వీధులు మార్మోగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపికపై ఫిర్యాదు

సైదాపూర్, మే 17: వెన్నంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక తీరుపై గ్రామ ప్రత్యేకాధికారికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవినీతిని వెలికితీసి అర్హులకు ఇండ్లు అందించాలని కోరారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, మే 17 : 2025-26 విద్యాసంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపికకోసం ప్రభుత్వామోదితం పొందిన పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ఉపసంచాలకుడు పి.పవన్‌కుమార్ తెలిపారు. 7, 10 తరగతుల్లో 90శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించి, అందులో 50శాతానికి పైగా మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులైన పాఠశాలల నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. రెసిడెన్షియల్ విధానంలో విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్, భోజన వసతి కోసం ఒక్కో విద్యార్థికి రూ.42వేలు, నాన్ రెసిడెన్షియల్ విధానంలో ట్యూషన్ ఫీజు కోసం రూ.28వేలు ఒక్కో విద్యార్థికి చెల్లించనున్నట్లు వెల్లడించారు. ఔత్సాహిక పాఠశాలల నిర్వాహకులు తమ దరఖాస్తులను ఈనెల 22 సాయంత్రం 5గంటల్లోపు నగరంలోని ప్రతిమ మల్టిప్లెక్స్ ఎదురుగా గల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుల కార్యాలయంలో అందజేయాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

### మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి..

చిగురుమామిడి, మే 17: మండలంలోని చిన్న ముల్కనూర్ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఇంగ్లిష్ మీడియం) ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ హర్జీత్ కౌర్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో 40 చొప్పున సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# హైబీపీని తేలిగ్గా తీసుకోవద్దు

- మెడికవర్‌లో హైపర్ టెన్షన్‌పై అవగాహన, బైక్ ర్యాలీ



ర్యాలీ తీస్తున్న మెడికవర్ వైద్యులు, సిబ్బంది

విద్యానగర్, మే 17: హైబీపీ అనేది ఒక వ్యాధి అని, దానిని తేలిగ్గా తీసుకుంటే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని మెడికవర్ వైద్యులు వెల్లడించారు. అధిక రక్త పోటుపై అవగాహన దినోత్సవం సందర్భంగా శనివారం కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. హైబీపీ కారణంగా శరీరంలోని గుండె, మెదడు, కిడ్నీ పనితీరుపై ప్రభావం పడుతుందన్నారు. హైబీపీ మధుమేహం కన్నా ప్రమాదకరమైనది చెప్పారు. హైబీపీ ఉన్న వారు ఆరోగ్యకరమైన జీవన శైలి, సరైన ఆహారం, వ్యాయామం, మందుల వాడకం, సరైన ఆహారం తీసుకోవడంపై దష్టి పెట్టాలని వైద్యులు సూచించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వినయ్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ లోకేష్, డాక్టర్ అనీష్ పబ్బ, డాక్టర్ రవిమల్లారెడ్డి, కోట కర్ణాకర్, సాయిచరణ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎన్నిక

శంకరపట్నం, మే 17: సీపీఐ మండల కార్యదర్శిగా కొత్తగట్టు గ్రామానికి చెందిన పిట్టల సమ్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, తన ఎన్నికకు సహకరించిన సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్, మహిళా సమైక్య అధ్యక్షురాలు కిన్నెర మల్లవ్వ, నాయకులకు సమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు.

# ‘ఉపాధి’ కూలి రూ.500 చెల్లించాలి

శంకరపట్నం, మే 17: ఉపాధిహామీ కూలీలకు రోజువారీ కూలి రూ.600 చెల్లించాలని ఆల్ ఇండియా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సంపత్ డిమాండ్ చేశారు. శనివారం యూనియన్ నాయకులు ఎరడపల్లి గ్రామ శివారులో ఉపాధిహామీ పనుల ప్రదేశాన్ని సందర్శించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత ఆరు వారాలుగా ఇక్కడ కూలీలకు కూలి డబ్బులు చెల్లించడం లేదని తెలిపారు. అంతేగాక 15 సంవత్సరాలుగా ప్రభుత్వం కార్మికులకు పనిముట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న కేరళలో కూలీలకు రూ.600 చెల్లిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల ఉపాధిని దెబ్బతీసేలా, ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చేలా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానాలను నిరసిస్తూ జూలై 9న దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు వెల్లడించారు. అలాగే పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్స్‌తో ఈ నెల 20న ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. కార్మికులు, ఉపాధి కూలీలు విజయవంతం చేయాలని కోరారు. ఇక్కడ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కనకం దుర్గాప్రసాద్, కమిటీ సభ్యులు కనకం భూపతి, జాలిగం నాగయ్య, నేదురు చంద్రయ్య, రాజమ్మ, కోమల, రజిత, రేణుక, మల్లమ్మ, నర్సమ్మ, తదితరులు ఉన్నారు.

## జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన యువతికి సన్మానం



జూనియర్ సివిల్ జడ్జి మానసను సన్మానిస్తున్న ఎన్నారై గంప వేణుగోపాల్

హుజూరాబాద్ టౌన్, మే 17: ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన బత్తుల మానసను లండన్‌కు చెందిన ఎన్నారై గంప వేణుగోపాల్ పట్టణంలోని విద్యానగర్‌లోని ఆమె నివాసంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు పీవీ సేవా సమితి అధ్యక్షుడు తూము వెంకట్ రెడ్డి, మురికి గౌరీ శంకర్, అనిత పాల్గొన్నారు.

# సన్‌షైన్‌లో సైనికులకు ఉచిత ఓపీ సేవలు




సైనికులకు అందిస్తున్న ఉచిత ఓపీ వైద్య సేవల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సురేశ్‌కుమార్

విద్యానగర్, మే 17: సన్‌షైన్ హాస్పిటల్‌లో సైనికులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత ఓపీ వైద్య సేవల పోస్టర్‌ను శనివారం హాస్పిటల్ సీఈఓ డాక్టర్ సురేశ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ సరిహద్దుల్లో సైనికులు వారి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్నందు వల్లే మనం ప్రశాంతంగా ఉన్నామన్నారు. అలాంటి సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు ఎంత సేవ చేసినా తక్కువేనన్నారు. హాస్పిటల్‌లో అన్నిసూపర్ స్పెషాలిటీ వైద్యసేవలకు సంబంధించిన ఉచిత ఓపీ వైద్య సేవలు, రక్త పరీక్షలకు సంబంధించిన వాటిలో 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, తమ కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సేవలు అందించడానికి ముందుకు వచ్చిన హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగులు సంపత్‌రావు, రాజిరెడ్డి, అట్టెపల్లి తిరుపతి, మునీందర్, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ ఎడ్ల సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న నాగార్జున డెయిరీ ఏజీఎం

హుజూరాబాద్ టౌన్, మే 17: హుజూరాబాద్ హైస్కూల్ గ్రౌండ్‌లో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు నాగార్జున డెయిరీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం పౌష్టికాహారం వితరణ చేశారు. డెయిరీ ఎండీ పుల్లూరి ప్రభాకర్ రావు, డైరెక్టర్ గణేశ్ రావు సహకారంతో డెయిరీ ఏజీఎం ఆకునూరి సుధాకర్ సుమారు 180 క్రీడాకారులకు అరటి పండ్లు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కే హరిప్రసాద్, ఉపాధ్యక్షుడు మండల యాదగిరి, సభ్యులు గోవర్ధన్, శ్రీనివాస్ రెడ్డి, మతిన్, కరాటే మాస్టర్ బి. బాబూరావు, మున్సిపల్ సిబ్బంది ప్రతాప రాజు, రొంటాల సుధీర్, తూముల కుమార్, వినయ్, నరేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.






## ఆటో, బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

వీణవంక, మే 17: మండలంలోని వల్బాపూర్ గ్రామ శివారులో శనివారం ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో కల్వల రాజిరెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వల్బాపూర్ గ్రామానికి చెందిన కల్వల రాజిరెడ్డి బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన వీణవంక గ్రామానికి చెందిన ప్యాసింజర్ ఆటో ఢీకొన్నది. రాజిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటోను అజాగ్రత్తగా, అతివేగంగా నడిపి ప్రమాదానికి కారణమైన ఎండీ రజాక్‌పై రాజిరెడ్డి కుమారుడు సదాశివరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 17: నగరంలోని రేకుర్తి రస్తాలో 33కేవీ లైన్ షిఫ్టింగ్ పనులు చేపడుతున్నందున ఆదివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ జీ రఘు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రేకుర్తి, జగిత్యాల రోడ్డు, సీతారాంపూర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

## 22న జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కొత్తపల్లి, మే 17 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అండర్ 19 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేని లక్ష్మణ్ తెలిపారు. కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో జరిగే ఈపోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు తమ పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రాలు, ఎస్సెస్సీ మెమో, ఒరిజనల్ ఆధార్ కార్డు తీసుకుని ఈనెల 22 సాయంత్రం 3గంటలకు అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రభాకర్, పీఈటి శ్రీధర్ వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు. పోటీల్లో ఎంపికైన వారు ఈనెల 28 నుంచి 30 వరకు నల్గొండ జిల్లా నకిరేకల్‌లో జరుగబోయే రాష్ట్ర స్థాయి హాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. పూర్తి వివరాలకోసం 9441925807/ 8978995730 నంబర్లలో సంప్రదించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

## కరెంట్ షాక్‌తో మాజీ సర్పంచ్ మృతి



విజయ్ కుమార్ (ఫైల్)

సైదాపూర్, మే 17: మండలంలోని సైదాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కనుకుంట్ల విజయ్ కుమార్(58) కరెంట్ షాక్‌తో మృతి చెందారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. విజయ్ కుమార్ హనుమాన్ మాల వేసుకున్నారు. శనివారం ఉదయం ఇంట్లో స్నానం చేసిన అనంతరం బట్టలు అరవేస్తుండగా కరెంట్ షాక్ వచ్చి అక్కడికక్కడే చనిపోయారు.

## ఆర్డీవో విచారణ

చిగురుమామిడి, మే 17: మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన రైతులు బోయిని గణేశ్, దేవేంద్ర, కొమురయ్య ఇటీవల తమ పట్టా భూమికి తహసీల్దార్ పాసుబుక్కులు ఇవ్వడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, ఈ క్రమంలో కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ శనివారం తాసిల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. వారి భూములకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని, కేవలం 2013లో జారీ చేసిన పట్టాసర్టిఫికేట్లు మాత్రమే ఉన్నా వాటికి సంబంధించి రికార్డుల్లో ఎక్కడా నమోదు కాలేదని తెలిపారు. వారు చేస్తున్న ఆరోపణలు నిరాధారమన్నారు. ఇక్కడ తహసీల్దార్ ముద్దసాని రమేశ్, ఆర్‌ఐ తార, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.